



ఓం నమోభగవతే శ్రీరమణాయ

# రమణ భాస్కర


సంపుటి : 5 సంచిక : 5 పుష్యం : 18-21 ఎడిటర్ : పి. హెచ్. వి. సత్యవతి (హైమ)


## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 28-10-99, కైకలూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఇతరులకు ఏదైనా సుఖంగాని, శాంతిగాని, ఆనందంగాని ఇవ్వాలంటే మనం సుఖంగా, శాంతిగా, ఆనందంగా ఉండాలి, మనకు ఆనందం లేకపోతే ఇతరులకు ఆనందం ఎలా ఇవ్వగలము. మనం సుఖంలేకుండా బాధపడుతూఉంటే ఇతరులకు సుఖం ఎలా ఇవ్వగలము. మనకు ఉన్నది ఏదో ఇతరులకు ఇవ్వగలము కాని మనకు లేనిది ఇతరులకు ఇవ్వలేము. శాస్త్రంలో ఏమి చెప్పారు అంటే జ్ఞాని దేహం ధరించి ఉన్నప్పటికి జ్ఞాని యొక్క ఉనికి సరిపోతుంది. మహాజ్ఞాని, మహాగురువు వలన లోకానికి మంచి జరుగుతుంది, శాంతి జరుగుతుంది, లోక కళ్యాణానికి జ్ఞానియొక్క జ్ఞానం సహకరిస్తుంది అని పెద్దలు చెపుతారు. సృష్టియొక్క రహస్యం, మాయయొక్క మర్మం అంతా మనస్సులోనే ఉంది. మనకు దుఃఖ కారణములు అన్నీ మనస్సులోనే ఉన్నాయి. మనస్సు అణిగిపోతే అంతా ఆనందమే. ఉద్యోగం మానేసి మీ సన్నిధిలో ఉండాలని ఉంది అని ఒకరు భగవాన్‌ను అడుగుతున్నారు. దానికి భగవాన్ ఏమి చెపుతున్నారు అంటే భగవాన్ ఎప్పడూ నీతోనే ఉన్నాడు. నీవు ఉద్యోగం విడిచిపెట్టనక్కరలేదు. నీవు చేసేపని శ్రద్ధగా చేయాలి. పనిని విడిచిపెట్టకూడదు. పని చేసేటప్పడు మనలోని బలహీనతలు మనకు తెలుస్తాయి. పుస్తకం చదివేటప్పడు బాగానే ఉంటోంది. పుస్తకంలో చదివింది ఆచరించేటప్పడు చిక్కువస్తోంది అని అడిగితే ఆచరించేటప్పడు కొన్ని ఇబ్బందులు వస్తాయి నిజమే ఎందుచేతనంటే జన్మజన్మల నుండి మనకూడా వచ్చిన సంస్కారములు అవి ఆచరించటానికి ఇష్టపడవు. వాటిని పట్టించుకోకుండా, మనస్సు చెప్పిన మాటలను ఒక ప్రక్కన పెట్టి, భగవంతుడు ఇలా చేయమని చెప్పాడు కదా ఇది మనధర్మం ఇలా చేద్దాము అని అలా పని చేసుకొంటూ వెళితే సంస్కారములు నశిస్తాయి. భగవాన్ ఏమి చెపుతున్నారు అంటే అహంకారాన్ని పట్టించుకోవద్దు, దానిని పట్టించుకోకుండా ఉంటే అది పోతుంది. ఆనందం ఎక్కడో దూరాన లేదు. అహంకారం వెనకాలే ఆనందం ఉంది. అది మనకు తెలియటం లేదు. అహంకారాన్ని వదిలేస్తే ఆనందం పట్టుకొంటుంది. అహంకారాన్ని

పట్టించుకోకుండా ఉంటే ఆనందం వచ్చి మిమ్మల్ని ఆవరిస్తుంది.

సర్వకాల సర్వావస్థలలో తన హృదయంలో ఉన్న నిజాన్ని ఎవడైతే పట్టుకొని ఉంటున్నాడో వాడిని జ్ఞాని అని అంటాము. మనకు కూడా నిజాన్ని పట్టుకొని ఉండాలి అని ఉంది. కాని మన వాసనలు నిజాన్ని పట్టుకోనివ్వటంలేదు మనం ప్రయత్నం చేసి ఏ వాసనలు అడ్డువస్తున్నాయో వాటిని తొలగించుకొంటే సమాధిస్థితి వస్తుంది. అంటే మీరు నిజంలో ఉండగలుగుతారు. ఎప్పుడైతే నిజం మనకి అనుభవం అయ్యిందో అప్పుడు శవాన్ని ధరించి ఈ భూమి మీదకు రానక్కరలేదు. అంతవరకు ఈ శవాలను మోయవలసిందే. నీవు ఉద్యోగం మానక్కర్లేదు. నీపని నీవు చేసుకో. నీవు చదివింది, విన్నది., ఆచరించేటప్పుడు ఏ వాసనలు అయితే నిన్ను ఆచరింప చేయనివ్వటం లేదో వాటిని తొలగిస్తే సరిపోతుంది అదే సాధన. దైనందిన జీవితంలో భగవంతుడు ఏ పని మనకు అప్పగించాడో ఆ పనిని శ్రద్ధగా చేస్తే మనకి చిత్తశుద్ధి కలుగుతుంది మనం వ్యాపారం చేయ్యాలంటే ధనం పెట్టుబడి ఉండాలి. భగవంతుని తెలుసుకోవటానికి చిత్తశుద్ధే పెట్టుబడి. మనం చేస్తున్నపని నిర్మలంగా శ్రద్ధగా చేసుకుంటూ వెళితే చిత్తశుద్ధి కలుగుతుంది. అదే దేవుని తెలుసుకోవటానికి పెట్టుబడి. కాని మనం ఏమనుకుంటున్నాము అంటే దేవుని పఠం ఎదురుగా పెట్టుకొని పూజ చేస్తేనే చిత్తశుద్ధి కలుగుతుంది అనుకొంటున్నాము.

ఈ జన్మలో చేసిన మంచి రాబోయే జన్మలో మూలధనం అవుతుంది అని భగవంతుడు చెప్పాడు. మనం చేసే పని చిన్నది అయినా పెద్దది అయిన శ్రద్దగా చేయాలి. ఆత్మ మీద మనస్సు నిలబెట్టినప్పుడు ఎంత శ్రద్ధగా చేస్తారో పని మీద కూడా మనస్సును అంత శ్రద్ధగా నిలబెట్టి చేస్తే అది కూడా ఆత్మజ్ఞానానికి సహకరిస్తుంది. మీరు మరణానికి మరణం తీసుకొని రావాలి అంటున్నారు భగవాన్. దేహం మరణించినప్పుడు నేను మరణిస్తున్నాను అని ఎవరు అనుకొంటున్నారు. ఈ దేహంతో తాదాప్యం పొందే నేను అనుకొంటోంది. దేహం మరణించకముందే దేహంతో తాదాప్యం పొందే నేను మరణిస్తే మరణం మరణిస్తుంది. అప్పుడు మీరు మరణం లేని స్థితిని అంటే ఆత్మస్థితిని పొందుతారు. దేహగతమైననేను వలన దేహబుద్ధికలుగుతుంది. దేహబుద్ధి వలన ద్వైతబుద్ధి కలుగుతోంది. ఈ దేహబుద్ది ద్వైత బుద్ధి నశిస్తేనే కాని మన హృదయంలో ఉన్న చైతన్యం సాక్షాత్కారం అవ్వదు. చైతన్యం మనకు సాక్షాత్కారిస్తేనే గాని మనం మరణంలేని స్థితిని పొందలేము మనహృదయంలో ఆనందం ఉంది అది మనకు అందటంలేదు. హృదయంలో ఉన్న ఆనందం అందక పోవటం వలన విషయాలను భోగించాలని మనం ఎక్కువగా విషయాలను చింతిస్తూ ఉంటాము. కొంతమంది ఇంటిలో పని లేకుండా ఉన్నారు అని మనం అనుకొంటాము. కాని వారు విషయాలను చింతిస్తూ ఉంటారు. వారు చేసే పని ఇహానికి పనికిరాదు పరానికి పనికిరాదు. ఎక్కువగా విషయాలను చింతిస్తారు. అది ముదిరితే వాళ్ళు పిచ్చివాళ్లు అవుతారు. జ్ఞానం, అజ్ఞానం అంటే ఏదో పుస్తకాలు చదివితే

జ్ఞానం, లేకపోతే అజ్ఞానం కాదు. దీనికి భగవాన్ ఏమి చెప్పారు అంటే ఇంటిదగ్గర ఒంటరిగా కూర్చొంటే నీకు విషయాలను భోగించాలని, విషయ చింతన వస్తూఉంటుంది. ఇటువంటి ఆలోచనలు వస్తూంటే అది అజ్ఞానం. అది లేకపోతే జ్ఞానం. నీ స్వరూపం నీకు తెలిసే వరకు విషయచింతన నిన్ను విడిచి పెట్టదు. ఎందుచేతనంటే విషయచింతన దేహగతమైన నేనును అంటిపెట్టుకొని ఉంది. ఆ నేను నశిస్తే విషయ చింతన నశిస్తుంది.

సజ్జన సాంగత్యంలో ౨౨ వంతులు మంచి ఉంది. ఒక వంతు చెడ్డకూడా ఉంది అని చెపుతారు. ఇప్పుడుమనంఅందరము ఒకరిని ఒకరు చూసుకొని ఆనందిస్తున్నాము, శ్రవణం చేస్తున్నాము. ఈ గోష్టి మనకు అంతర్‌దృష్టి కలుగచేస్తుంది. కాని మనం అందరం విడిపోయేటప్పుడు ఎంతో కొంత దుఃఖం వస్తుంది. అది చెడ్డ. ఈ దుఃఖం కూడా పోవాలంటే నీ హృదయంలో ఉన్న సద్వస్తువు మీద దృష్టి పెడితే దానిని ధ్యానం చేస్తూ ఉంటే అది నిరంతరము నీ కూడా ఉంటుంది కాబట్టి నీకు దుఃఖమే రాదు అన్నారు భగవాన్. నీవు చేసే పని దుఃఖపడుతూ చేయకు. భగవంతుడు నాకు ఈ పని ఇచ్చాడు. ఆపని పూర్తి చేయాలి అనుకొని నీకు ఇచ్చిన పనిని ఆనందంగా చెయ్యి. అలా పని చేస్తూ ఉంటే భగవంతునితో నీకు రాజీ కుదురుతుంది. మీ కోడలు నచ్చిందా అని ఒకరిని అడిగితే వచ్చిన కోడలు నచ్చింది అన్నారు. మన ఇంటికి వచ్చాక ఆ అమ్మాయి మన అమ్మాయి అని జాగ్రత్తగా చూసుకోవాలి అదీ భగవంతునితో రాజీపడటం అంటే. రాగద్వేషములను విడిచిపెడతే నదివెళ్ళి సముద్రంలో కలిసినట్లు నీ మనస్సు వెళ్ళి హృదయంలో లయమవుతుంది.

మీ అందరకు మీ భర్త అంటే మీకు ఇష్టం. మీ పిల్లలు అంటే మీకు ఇష్టం. ఇలా మీ ప్రేమ కుటుంబసభ్యులకు పరిమితమైపోయింది. ఇలా నీలో ఎవడైతే ఇష్టపడుతున్నాడో వాడు వెళ్ళి హృదయంలో కలిసిపోతే ఇప్పుడు నీ ఇంటిలో ఉన్న వ్యక్తులను నీవు ఎలా ప్రేమిస్తున్నావో అప్పుడు ఈ సృష్టిని అంతా అలా ప్రేమిస్తావు. అప్పుడు మొద్దబ్బాయివి అయిపోవు. ఇప్పుడు మనందరకు అహంకారం ఉంది. అది పోయింది అనుకోండి. మనం పోము దాని స్థానంలో ఆత్మజ్ఞానం, ఆత్మశాంతి తాండవిస్తుంది. అప్పుడు నీ ప్రేమ సృష్టి అంతా వ్యాపిస్తుంది, నీవు ప్రపంచాన్ని మింగుతావు. నీకు ఎప్పుడైతే నిజమైన జ్ఞానం కలిగిందో ఈ సృష్టితో అత్యంత సన్నిహితమైన సంబంధం కలుగుతుంది. అప్పుడు జాతి, కుల, మత విచక్షణ లేకుండా ప్రపంచం అంతటికి తన జ్ఞానాన్ని, ప్రేమను పంచిపెడతాడు. నీవు జ్ఞానం సంపాదిస్తే నీవు కొండగుహలో కూర్చొన్నా, ఇంటిలో కూర్చొన్నా నీ ప్రభావం సృష్టి మీద ఉంటుంది.

మనం జ్ఞానం సంపాదించాలంటే సత్వగుణం ఉండాలి. సత్వగుణం వలన సహనం

వస్తుంది. సహనం వలన హృదయం యొక్క లోతులు పెరుగుతాయి. బ్రహ్మం ఎంత లోతులలో ఉందో అంతలోతులలోనికి సహనం తీసుకొని వెళుతుంది. కొంతమంది మొఖాలు సాత్వికంగా ఉంటాయి. వారు దేనికి రియాక్టుఅవ్వరు. అలా జరుగవలసి ఉంది కాబట్టి అలా జరుగుతోంది అనుకొంటారు. వారి మొఖాలు చూస్తే మనకు కూడా సత్వగుణం సంపాదించాలని ఉంటుంది. సాత్విక సంపద ఉన్నవాడితో సహవాసం చేస్తే మనకు సత్వగుణం వస్తుంది. వాడు ఇంట్లో ఉన్నాడా, వాడు సన్యాసా, వాడు తెల్లబట్టలు కట్టుకొన్నాడా, ఎర్రబట్టలు కొట్టుకొన్నాడా అనేది మనకు అనవసరం. వాడికి సాత్విక ప్రవృత్తి ఉంటే వాడితో సహవాసం చేస్తే మనకు ఆధ్యాత్మిక అభివృద్ధి కలుగుతుంది. సన్యాసి ఎవరైనా కనిపిస్తే వారి పూర్వ విషయాలు అడగకూడదు. వారు అన్నీ మర్చిపోయి వచ్చారు. మరల వారికి జ్ఞాపకం తీసుకొనిరాకూడదు. వారు తెలుసుకొన్న జ్ఞానాన్ని మనం నేర్చుకోవాలి. నీకు భగవంతుడు ఏ పని ఇచ్చాడో ఆ పని చెయ్యి. నేను గృహస్థుడను నాకు జ్ఞానం రాదు అని అనుకోకు. అలా అనుకోవటం కూడా నీకు అడ్డుఅవుతుంది. నేను చెప్పిన మాటవినకుండా నీవు ఇల్లు విడిచిపెట్టి వెళతావు అనుకో, ఒకటి గుర్తుంచుకో నీ వాసనలు, నీ కోరికలు, నీ తలంపులు, నీ మనస్సు నీవు ఎక్కడికి వెళ్ళినా అన్నీ నీకూడా వచ్చేస్తాయి. నీవు ఇల్లు విడిచిపెట్టినంత మాత్రం చేత నీ మనస్సులో ఉన్న కల్మషం, కుళ్ళ అంతా పోతుంది అనుకోకు, నీ కల్మషం అంతా నీకూడా వచ్చేస్తుంది. నీవు ఎక్కడ ఉన్నా సాధన చేసి ఈ కుళ్ళ అంతా తొలగించుకోవలసిందే. జ్ఞానసముపార్జనకు నీలో ఉన్న కుళ్ళ అంతా పోవాలి.

గాఢ నిద్రలో నుండి జాగ్రదావస్థలోనికి రాగానే మొదట నేను అనే తలంపు వస్తుంది., ఆ మొదటి తలంపు వచ్చి దేహంతో తాదాప్యం పొందుతుంది. ఏ తలంపు అయితే దేహంతో తాదాప్యం పొందుతోందో అదే మూలతలంపు, అదే అహంకారం. అన్ని అరిష్టాలకు అదే కారణం. ఆమూలతలంపు ఉంటే అన్నీ ఉన్నాయి. అదే లేకపోతే ఏదీ లేదు. ఈ ఖగోళం అంతా ఆమూల తలంపు మీద ఆధారపడి ఉంది. అదే నీవు అనుకొంటున్నావు. అందుచేత దానిని నీవు సందేహించటంలేదు. దానిని సందేహిస్తే దానిని షేక్ చేయగలవు. ఆమూలతలంపు మూలంలోనే సుఖం ఉంది, శాంతి ఉంది. ఆమూలతలంపు నశించిన వెంటనే నదికి వరద వచ్చినప్పుడు ప్రవాహం ఎంత వేగంగా ఉంటుందో అంతవేగంగా శాంతి, సుఖం హృదయంలోనుండి వచ్చి నీ సహస్రారాన్ని ముంచుతుంది. అప్పుడు ఆనందం కోసం శాంతి కోసం బజారులో వెతుక్కోనక్కరలేదు. నీ మనస్సు అనేది ఒక సమస్య. దానిని నీవే పరిష్కరించుకోవాలి. పరిసరాలు మారినంత మాత్రంచేత, జన్మలు మారినంత మాత్రంచేత నీకు మనస్సు అనే సమస్య పరిష్కారం కాదు. దానిని పరిష్కారం చేసుకోవటానికి నీవు కృషి చేయాలి. ఇల్లు విడిచి పెట్టి వెళితే పరిసరాలు మారతాయి.

చనిపోతే దేహం మారుతుంది. అంత మాత్రం చేత నీకు జ్ఞానం రాదు.

నీవు ఏ ఆశ్రమంలో ఉన్నా అవరోధం అల్లా ఒక్కటే, అదే నీ మనస్సు, తొలగించుకోవలసింది దానినే, నిన్ను నీవు ఉద్ధరించుకో . నిన్ను నీవు ఉద్ధరించుకొంటే నీ ద్వారా అనేకమంది ఉద్ధరింపబడతారు. ఇల్లు విడిచిపెట్టటం కాదు. ఇంట్లో ఉన్న వ్యక్తుల మీద మోహం విడిచిపెట్టి పనిచెయ్యి. పరిసరాలు, ఇంట్లో వ్యక్తులు, స్నేహాలు, విరోధాలు అన్నీ కర్మనుబట్టి వస్తాయి. కర్మ ఎవరికి? దేహగతమైన నేనుకే. ఆ కర్తను తీసేస్తే కర్మలేదు. నాకర్మ, నాకర్మ అని ఎవడైతే అంటున్నాడో ఆ కర్తను తీసివేస్తే ఇంక కర్మలేదు. అందుచేత నీవు ఉన్న చోటనే ఉండు, కర్త లేకుండా కర్మ చెయ్యి. కర్త లేని కర్మ చేసేవాడికి తనకు తెలియకుండా, పూజలు, ధ్యానాలతో సంబంధం లేకుండా మనస్సు వెళ్ళి చైతన్యంలో కలిసిపోతుంది.

నీవు ఏపని చేస్తున్నా నీ మనస్సుకు లోచూపు అలవాటు చెయ్యి.. లోచూపు లేనివాడికి ఆధ్యాత్మిక సంస్కారం రాదు. లోచూపు ఉన్నవాడికి ఆత్మసౌందర్యం తెలుస్తుంది. నీకు లోచూపు కలిగితే నీవు ఎన్నిపనుల మధ్య ఉన్నా నీవు శాంతిగా ఉంటావు. నీవు పని ఎలా చేస్తున్నావు అనేది ముఖ్యం. మమకారంతో పనిచేస్తే అజ్ఞానంలో కూరుకొనిపోతావు. మమకారం లేకుండా చేస్తే అజ్ఞానంలో నుండి బయటకు రావటానికి నీపని సహకరిస్తుంది. ఈ దేహమే నిజం, ఈ దేహమే ఆత్మ, ఇది తప్ప ఇంకేమీలేదు అని ఎంతకాలం అయితే అనుకొంటావో అంతకాలం నీకు కోరికలు వస్తూనే ఉంటాయి. వింటే ఆత్మగురించేవిను, చూస్తే ఆత్మనే చూడు, చదివితే ఆత్మగురించే చదువు, ఆత్మనే మననం చెయ్యి అలా ఆత్మ నిష్టలో ఉంటే నీకు కోరికలు నశిస్తాయి. నీ దేహం ద్వారా ఏ పని జరగాలో నీ తల్లి కడుపులో ఆ దేహం తయారయ్యేటప్పుడు నిర్ణయం అయిపోతుంది. నీ దేహం ద్వారా ఆ పని జరుగుతూ ఉంటుంది., ఆ పనితో నీవు తాదాప్యం పొందటం మానివెయ్యి. పనీ అయిపోతుంది, నీకు జ్ఞానం కలుగుతుంది. మనం వందసంవత్సరాలు జీవించినప్పటికీ ఇంకా మనకు చనిపోవాలని ఉండదు, ఇంకా ఉండాలనే ఉంటుంది. ఆ ఉండటమే దేవుడు దేహం చనిపోయిన తరువాత కూడా నీవు ఉంటావు అనే అనుభవం నీకు రావాలి. అప్పడు మరణం మరణిస్తుంది. మాయ మాయమవుతుంది. అప్పడు ఆత్మయొక్క తత్వం నీకు అనుభవైక వేద్యం అవుతుంది. అప్పడు ఉన్న వస్తువు ఉన్నట్లుగా నీకు వ్యక్తమవుతుంది.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 24-12-99, జిన్నూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

ఈ రోజు శ్రీ రమణజయంతి. బాహ్యమైన చీకటిని సూర్యుడు పోగొడతాడు. కాని లోపల ఉన్న చీకటిని సూర్యుడు పోగొట్టలేడు. లోపల ఉన్న అజ్ఞానం అనే చీకటిని తొలగించే

వాడే గురువు. బ్రహ్మంలో ఎలా ఐక్యం కావాలి అని మనకు ఓర్పుగా నేర్పి, బ్రహ్మంలో మనలను ఐక్యం చేసేవాడే గురువు. అజ్ఞానం అనే చీకటిని గురువు సహాయం లేకుండా తొలగించుకోలేము. లోపల ఉన్న చీకటిని తొలగించుకోలేకపోతే మన హృదయంలో ఉన్న వస్తువుతో మనం తాదాప్యం పొందలేము. మనస్సు అనేది ఒక పెద్ద గ్రహం. ఎవడైతే గురువు అనుగ్రహం వలన మనస్సు అనే గ్రహంలోనుండి బయటకు వచ్చాడో వాడిని మిగిలిన గ్రహాలు ఏమీ చేయలేవు. జాతకాలు ఏమీచేయలేవు. అజ్ఞానాన్ని తొలగించుకోవటానికి మనం ఎంతో కొంత ప్రయత్నం చేస్తాము. కాని మన ప్రయత్నం ఒక్కటే సరిపోదు. గురువు సహాయ సహకారములు అవసరం. జ్ఞానగంగ నీ హృదయంలో ఉంది. అది నీ సహస్రారానికి అందటంలేదు. అది నీకు అందటానికి నాన్నగారు చెప్పే మాట సహకరించాలి గాని నాన్నగారు బాగా చెప్పారు అంటే ఏమీ ప్రయోజనం లేదు. భగవాన్ దేహం ధరించింది శివక్షేత్రం, ఆయనకు జ్ఞానం కలిగింది శివక్షేత్రం, ఆయన బోధించింది శివక్షేత్రం. ఆయనకు జీవితం పొడుగునా శివక్షేత్రంతో అనుబంధం ఉంది. భగవాన్ కారణజన్ములు. కారణ జన్ములు జన్మించినా వారికి దేహంతో తాదాప్యం ఉండదు. వారు దేహంలో ఉన్నప్పుడు కూడా ఈ దేహం మనది కాదు అని వారికి స్పష్టంగా తెలుస్తూ ఉంటుంది. వారికి దేహం ఉండటం వలన లాభంలేదు, దేహం పోవటం వలన నష్టంలేదు. అన్ని అరిష్టాలకు కారణం దేహాభిమానం. మనకు రాగద్వేషములతో, అహంకారంతో తాదాప్యం ఉంది. మన మనస్సుతో లోపల గోడలు కట్టుకొంటాము. తెలివైన వారు తెలివితో గోడలు కట్టుకొంటారు. చనిపోయేవరకు ఇదే జ్ఞానం అనుకొని వారు జీవిస్తూ ఉంటారు. ఆవరణదోషం, మలదోషం, విక్షేపదోషం ఇవి అన్నీ మనస్సుకే ఆత్మకు ఏదోషం లేదు. ద్వైతభావనలో నుండి బయటకు రావటానికే ఈ సత్సంగ సమావేశాలు.

మాయకంటే విషం మంచిది. విషం ఈ ఉపాధిని చంపుతుంది. కాని మాయ అనేక ఉపాధులను, చావుపుట్టుకలను తీసుకొని వస్తుంది. మాయ ఎక్కడో ఉంది అనుకొంటున్నాము. మాయ మనోరూపంలో ఉంది. నేను రజోగుణంలో ఉండి మాటలు చెపితే హృదయంలో ఉన్న వస్తువు మీకు అందదు. నేను సత్వగుణం సంపాదించి నాలుగు మాటలు చెపితే నీ హృదయంలో ఉన్న వస్తువు నీకు అందుతుంది.. మనకు నూటికి నూరు పాళ్ళు దేహంతో తాదాప్యం ఉంది. దేహం పుడితే పుట్టాము అనుకొంటున్నాము, దేహం చనిపోతే చనిపోతున్నాము అనుకొంటున్నాము. మనకు దేహమే సర్వస్వం. మన హృదయంలో ఒక సద్వస్తువు ఉంది. దాని స్వరూపమే ఆనందం, దాని స్వరూపమే సుఖం, దాని స్వరూపమే శాంతి. దానికి చావు పుట్టుకలు లేవు. అది స్వతంత్రమైనది. స్వతంత్రం వచ్చింది అంటే ఎవరో ఇతరులు భౌతికంగా పెట్టే బాధలనుండి బయటకు రావటంకాదు,

భౌతికమైన పీడనుండి బయటకు రావటం కాదు, అజ్ఞానంలో నుండి బయటకు రావటమే స్వాతంత్ర్యం. అప్పుడు మనకు స్వేచ్ఛకలుగుతుంది, సుఖం తెలుస్తుంది. సత్యవస్తువు హృదయంలో ఉంది. హృదయంలో వెతకటం ప్రారంభిస్తే ఈ జన్మకైనా, వందజన్మలకైనా అది నీకు దొరుకుతుంది. వస్తువు లేని చోట వెతికితే కోటి జన్మలు ఎత్తినా అది మనకు దొరకదు. కృష్ణుడు హృదయవాసి. కాని మనం ద్వారకావాసా, గోకులవాసా అంటాము. బృందావనం వెళతాము, గోకులం వెళ్ళివస్తాము. కాని హృదయంలో వెతకటానికి మనం ఏమీ ప్రయత్నం చేయము. మన ఆలోచన సక్రమంగా లేదు. ఉన్నది అంతా హృదయంలోనే ఉంది. హృదయంలో ఉన్న వస్తువును తెలుసుకొంటే వైకుంఠానికి, కైలాసానికి ఇతరలోకాలకు అన్నింటికి కూడా ఆ వస్తువే ఆధారంగా ఉంది అని మనకు తెలుస్తుంది. మనకు చిన్న వయస్సులో తత్వం యొక్క ప్రాధాన్యత తెలియదు. వయస్సులో ఉండగా పొగరుబోతుతనంగా ఉంటాము. ముసలివయస్సు వచ్చాక జరిగిపోయిన గొడవలు తలపెట్టుకొంటూ ఉంటాము. ఇంక ఏ వయస్సు లో జ్ఞానం కోసం ప్రయత్నం చేస్తాము? ఇంక మనకు జ్ఞానం ఎలా కలుగుతుంది? దారిద్ర్యం అంటే మనకు భయం. కాని దారిద్ర్యాన్ని చూసి నేను గర్విస్తున్నాను అన్నాడు ప్రవక్త. మహాజ్ఞానంలో మీ దేహప్రారబ్ధాన్ని బట్టి దారిద్ర్యం వచ్చింది అనుకో, నేను దరిద్రుడ్ని అని వాడు అనుకోడు. ఎందుచేతనంటే ఈ దారిద్ర్యం, ధనం అనేవి ప్రకృతికి సంబంధించిన విషయములు. అసలు వస్తువుకు వీటితో ఏమీసంబంధం లేదు. మనం ధనాన్ని చూసి గర్విస్తున్నాము కాని మహ్మద్ ప్రవక్త ఏమి చెప్పాడు అంటే నేను దారిద్ర్యాన్ని చూసి గర్విస్తున్నాను అని చెప్పాడు.

మాకు జ్ఞానంరాదు, మాకు జ్ఞానం రాదు అని అనుకోవద్దు. మీకు జ్ఞానం తప్పక కలుగుతుంది. ఎందుచేతనంటే మీరు రైలులో కూర్చున్నారు. రైలులో కూర్చొన్నాక మీరు గమ్యానికి వెళ్ళకూడదు అనుకొన్నా అది తీసుకొని వెళుతుంది. మీకు అందరికీ జ్ఞానం కలుగుతుంది. అనుమానం వద్దు. ఇప్పడు మనం ఇంద్రియాలతోటి, ఇంద్రియాలకు సంబంధించిన విషయాలతోటి, లోకంతోటి ఎలాగ తాదాప్యం పొందుతున్నామో అలాగ లోపలఉన్న అమృతవస్తువుతో ఎవడైతే పూర్తిగా తాదాప్యం పొందుతున్నాడో వాడిని ఆత్మజ్ఞాని అంటారు. జ్ఞానం కలిగిన తరువాత ఎలాగ ఉంటుంది అంటే మహాసముద్రంలో నీటి బుడగ ఎలాగ ఉంటుందో, జ్ఞానం కలిగిన తరువాత ఈ ఖగోళం అంతా నీకు హృదయంలో ఒక బుడగలాగ ఉంటుంది. అది జ్ఞానం యొక్క వైభవం. బుడగను సముద్రం పట్టించుకోదు. బుడగకు సముద్రం ఆధారంగా ఉంది. అలాగే ఈ సృష్టికి అంతా నీ హృదయంలో ఉన్న వస్తువే ఆధారంగా ఉంది అని నీకు తెలుస్తుంది. సగం జ్ఞానం, సగం అజ్ఞానం ఎక్కడా ఉండదు. భగవంతుని మాటలను శ్రవణం చేయటం వలన, మననం చేయటం వలన మన చైతన్య స్థాయి పెరుగుతుంది. ఆత్మానుభవం కలగటానికి గురువు

అనుగ్రహం అవసరం. అది జన్మాంతర అనుబంధం బట్టి ఉంటుంది. మనం చేసిన మంచి, చేసిన కృషి వృదాపోదు అదే మనకు ఎదురు వస్తుంది. ఈశ్వరుడికి ఎవడైతే పూర్తిగా శరణాగతి పొందాడో ఆదేహాన్ని పరమేశ్వరుడు ఉపయోగించుకుంటాడు. అందుచేత జ్ఞాని యొక్క దేహం దేవాలయంతో సమానము.

మాకు ఆత్మజ్ఞానం పొందాలని ఉంది కాని మాకు ఎందుకు కలగటంలేదు. మీకు ఆత్మజ్ఞానం కలగకపోవటానికి కారణం సమాజం కాదు, మీకు కుటుంబసభ్యులు కాదు. మీకు పూర్వజన్మ నుంచి వచ్చిన మీ అలవాట్లే కారణం, నీలో ఏ బలహీనతలు ఉన్నాయో చూసుకోవాలి. ఆ బలహీనతలు లేనివారితో సహవాసం చేయాలి. ఏ అలవాటు అయితే ఈ జన్మలో నిన్ను గట్టిగా పట్టి పీడిస్తుందో ఆ అలవాటు ఎంతో గొప్పది అని, అందులో ఎంతో విలువ ఉంది అని గత జన్మలో నీవు కావాలని తెచ్చుకొన్నావు. దానిని ఇష్టంగా ప్రాక్టీసు చేసావు. అందులో ఉన్న దోషం ఇప్పుడు నీకు తెలుస్తోంది. దానిని బయటకు గెంటటానికి ప్రయత్నం చేస్తున్నావు. దాని బలం ఎక్కువగా ఉంది, నీ సాధనా బలం తక్కువగా ఉంది. నీ అలవాటు యొక్క బలం ఎంత ఉందో దానికి రెట్టింపు నీ సాధనాబలం ఉంటే అప్పుడు గురువు అనుగ్రహం వస్తుంది. అప్పుడు నీ సాధనాబలంతో ఆ అలవాటును బయటకు గెంటి కాల్చి బూడిద చేయగలవు. ఎక్కడో మోక్షం వరకు వెళ్ళనక్కరలేదు. నీకు ఉన్న చిన్న చిన్న అలవాట్ల నుండి బయటపడటానికి కూడా ఈశ్వరానుగ్రహం అవసరం. మన మనస్సును శుచిగా ఉంచుకొంటే మన ఆలోచన సక్రమంగా ఉంటే, లోపల స్వార్ధం లేకుండా ఉంటే తప్పని సరిగా లోపల నుండి గైడెన్స్ వస్తుంది. ఎప్పుడో కాదు నీ మనస్సులో దోషం లేనప్పుడు ఇప్పుడే ఇక్కడే మనకు లోపల నుండి గైడెన్స్ వస్తుంది. పెద్దలు చెప్పినమాటలు వింటూ, ఈశ్వరుని స్మరించుకొంటూ నీ పద్ధతిలో నీవు సాధన చేస్తూ ఉంటే నెమ్మదిగా అలవాట్ల యొక్క వేగం తగ్గుతుంది. ఒక్క ఆత్మ తప్పించి, బ్రహ్మంతప్పించి మిగతా విషయాలను గురించి ఏది ఆలోచించినా ఆ విషయాల గురించి ఆలోచించమని నీకు ఎవరు చెప్పారు అనేవారు భగవాన్. నీవు ఏది అయితే అవునో దాని గురించి శ్రవణం చెయ్యి, దాని గురించి మననం చెయ్యి, దాని గురించి ఆలోచించు, దానిని చూడటం నేర్చుకో అది నీ గుండెకు తాకేలా చూడు అప్పుడు అదే నీవు అవుతావు. నీవు ఏదైతే అవునో దానిగురించి వినటం మానేసి నీవు కాని దాని గురించి వింటాను అంటావు ఏమిటి? నీవు కాని దాని గురించి ఆలోచించినా నీవు అది అవ్వవు. నీవు ఏది ఆలోచించినా పాజిటివ్‌గా ఆలోచించు.

మానవుడికి అన్నిటికన్నా వాడి అహంభావన అంటే వాడికి ఎక్కువ ఇష్టం. అలా ఇష్టం ఉన్నా ఫరవాలేదు అదే వాడు అనుకొంటున్నాడు. అందుచేత దానిని తొలగించుకోవటానికి వాడు ఏమీ ప్రయత్నం చేయటంలేదు. మనపురాణాలలో కూడా ఎక్కువ అహంభావన

గాథలే, భగవాన్ పురాణాలలో మాటలు చెప్పే వారు కాదు. గాథల వలన బాధలు వస్తాయి అనేవారు భగవాన్. ఒకసారి ఇంద్రుడు ఏనుగుమీద వస్తున్నాడు. దూర్వాసుడు ఇంద్రునికి ఒక దండ ఇచ్చాడు. ఆయన ఆదండను గౌరవంగా తీసుకుని ఏనుగు మీద పెట్టాడు. ఆ దండ మీద ఈగలు, దోమలు వాలుతున్నాయి. ఏనుగుకు చిరాకు వచ్చి తొండంతో ఆ దండను తీసి కాలుక్రింద పెట్టి త్రొక్కింది. ఇది అంతా దూర్వాసుడు చూసాడు. నేను ఇచ్చిన దండను ఏనుగు కాలుక్రింద వేసి త్రొక్కుతుందా అని ఇంద్రుడిని శపించాడు. ఎలా ఉందోచూడండి. అహంభావన వలన వచ్చే సమస్యలు ఎలా ఉంటాయో చూడండి. హృదయంలో మనస్సు అణగాలి. మనస్సు అణిగేవరకు నిన్ను ఏదో సమస్య వెంటాడుతూ ఉంటుంది. నీ హృదయంలో ఉన్న నిజం ఎవరోకాదు, అదే నీవు అయ్యి ఉన్నావు. కాని నేను అదికాదు, నేను దేహాన్ని అని అనుకొంటున్నావు. అక్కడ నుండేనీకు దురాలోచనలు అన్నీ వస్తాయి. మీరు ఏదో విషయం గురించి బాధపడుతున్నారు అనుకోండి, ఏదో కారణం వలన మీకు దుఃఖం వస్తోంది అనుకోండి, మీకు భగవంతుని మీద విశ్వాసం లేదు అని అర్థం. మనకు ఈశ్వరుని మీద పరిపూర్ణమైన విశ్వాసం ఉంటే మనకు దుఃఖం రాదు, ఏ విషయం మనలను బాధపెట్టదు. అన్ని కాలాలలోవున్నది భగవంతుడే. నీవు భవిష్యత్ గురించి కంగారు పడతావు ఎందుకు? భవిష్యత్ కాలంలో భగవంతుడు లేడా? ఉన్నాడు ఆయన ఉన్నాడు అనే విశ్వాసం మనకు ఉంటే ఇంక భయంరాదు, బాదలేదు. నీ హృదయంలో ఉన్న ఆత్మను నీవు మర్చిపోయినా అది ఉంటుంది. నీ జ్ఞాపకం మీద అది ఆధారపడి లేదు. మర్చిపోవటం, మర్చిపోకుండా ఉండటం అనేది నీ మనస్సుకు సంబంధించిన విషయాలు. అది స్వతంత్రమైనది. నీకు ఆత్మానుభవం కలగకపోవటానికి ఎవరో ఇతరులు కారణం కాదు. నీ సంస్కారములే కారణం అవి ఇంకా మానిపోలేదు. నీకువంట చేత కాదు అనుకో కుండలను, కూరలను తిడితే ఎలాగ? అలాగే నీకు జ్ఞానం రావటం లేదు అనుకో దానికి నీలో ఏమి అడ్డువస్తున్నాయో చూసుకోవాలి గాని ఇంట్లో వారిని, వీదిలో వారిని తిడితే ఎలాగ? కంటిలో కామం ఉన్నవాడికి హృదయంలో ఉన్న రాముడు ఎలా తెలుస్తాడు అని మధ్వాచార్యులు చెప్పారు. నీ కంటిలో ఉన్న దోషం మూలంగా ఆయన నీకు తెలియటంలేదు. నీ కంటిలో ఉన్న కామాన్ని తొలగించుకోలేవు సరికదా నా హృదయంలో రాముడు లేడు అంటావు ఏమిటి? నీ కంటిలో ఉన్న దోషాన్ని తొలగించుకొని చూడు అప్పుడు ఆయన నీకు తెలుస్తాడు. మనకు ఉన్న దుర్గుణాలు, దురలవాట్లనుండి భక్తి అనే పులి సహాయం లేకుండా మనం బయటకు రాలేము. పులిని చూసి మేకలు ఎలా పారిపోతాయో అలాగే భక్తి అనే పులి మనలో మేల్కొన్నప్పుడు ఈ దురలవాట్లుపోతాయి కాని భక్తిని మనం అలవర్చుకోకపోతే, సత్వగుణాన్ని మనం అలవాటు చేసుకోకపోతే ఈ దురలవాట్ల నుండి బయటకు వచ్చే అవకాశంలేదు.

వికారములు లేనివాడు యోగి, అహంకారం లేనివాడు జ్ఞాని, భగవదనుభవం ఉన్నవాడు భక్తుడు. భక్తుని మనస్సు ఎప్పుడూ అణిగి ఉంటుంది. అణిగినమనస్సుకు అంతర్‌దృష్టి కలుగుతుంది. అంతర్ దృష్టి కలిగినవాడికి ఆత్మలోనికి దారి కనిపిస్తుంది. ఆత్మలోనికి దారి కనిపించిన వాడు మాత్రమే అందులోనికి ప్రయాణించి ఆత్మలో ఐక్యం అవ్వగలడు. కొంత మంది ఏమి చెపుతున్నారు అంటే ఎంజాయ్ చేయటానికి నేను ఉండాలి కదా అది పోతే ఎలాగ? అని అంటున్నారు. పంచదార నోటిలో వేసుకొన్నాము అనుకోండి. పంచదార బాగుంది, తియ్యగా ఉంది అని చెప్పటానికి నేను ఉండాలి కదా ఆ నేనును తీసివేస్తే ఇంక పంచదార సుఖం ఏమిటి అంటున్నారు. భగవాన్ ఏమి చెపుతున్నారు అంటే దేవుడు అంటే పంచదార లాంటివాడా? పంచదార జడవస్తువు. నీ వ్యక్తి భావన పోతే నీ సుఖం పోతుంది అని కంగారు పడవద్దు. దానిని అదే ఎంజాయ్ చేస్తూ ఉంటుంది. పంచదార సుఖం గురించి చెపుతున్నావు. నీకు పంచదార అందకపోయినా దుఃఖం వస్తుంది. నీకు జ్వరం వస్తే పంచదార రుచి నీకు తెలియదు. అప్పుడు కూడ దుఃఖం వస్తుంది. ఇది ద్వైతం. బ్రహ్మానుభవం పొందినప్పుడు అక్కడ ద్వైతం లేదు. దానిని అదే ఎంజాయ్ చేస్తుంది. సత్యం గురించి మీరు శ్రద్ధగా శ్రవణం చేయగా చేయగా ఇంతకాలం నుండి దీని గురించి వింటున్నావు దీనిని తెలుసుకోవాలి అనే బుద్ధి మీకు కలుగుతుంది. దానిని తెలుసుకోవాలనే బుద్ధిమీకు కలిగినప్పుడు దానిని తెలుసుకోవటానికి అడ్డు ఉన్న తలంపులను పట్టించుకోకుండా ఉంటే అవి ఫలాయనం చిత్తగిస్తాయి. కోపం గురించి ఆలోచిస్తూ ఉంటే దానికి బలం పెరుగుతుంది. దానికి బలం మనమే ఇస్తున్నాము. దాని గురించి ఆలోచించకుండా ఉంటే దాని అంతట అదే పోతుంది.

కొంత మందికి సత్యం గురించి ఒక్కసారి శ్రవణం చేసేటప్పటికే జ్ఞానం వచ్చేస్తుంది మనకు కొంత కాలం పట్టవచ్చు. మనం తడిసిపోయిన పుల్లల వంటి వాళ్లము. తడిపుల్లలు పొయ్యిలోపెడితే పొగవస్తుంది. కాని నిప్పురాదు. బాగా ఎండిన పుల్లలు పొయ్యిలో పెట్టనవెంటనే అంటుకొని పోతాయి. అలాగే పక్వస్థితికి వచ్చిన వారు ఒక్కసారి వింటే వారు తదాకారం పొందుతారు. వారికి రెండోసారి అక్కరలేదు అటువంటివారిని చూసి వారికి ఇంత తేలికగా వచ్చేసింది మనకు ఎందుకు రావటంలేదు అని అనుకోవద్దు. వారు పూర్వజన్మలో ఎంతో కష్టపడ్డారు. పండిపోయి వచ్చారు. ఈజన్మలో రాలిపోయారు. ఆ కష్టం మీకు ఇప్పుడు కనబడటంలేదు. జ్ఞానం మీకు కనబడుతోంది. వాక్కు అణగాలి, ఇంద్రియాలు అణగాలి, మనస్సు అణగాలి అప్పుడు కదా నీకు సత్యం అనుభవంలోనికి వచ్చేది. ఈ ప్రవచనాలు లాంచనం కోసం కాదు, ఏదో ఒక్క వాక్యం అయినా మీ గుండెకు తాకుతుంది అని చెప్పటం, అజ్ఞానం పోగొట్టుకోమని చెపుతున్నారు కదా అది మనిషికి ఎలా

వచ్చింది అంటున్నారు. అజ్ఞానం నిజంగా లేదు. ఉన్నదల్లా జ్ఞానమే. నీవు ఎవరో నీకు తెలియకపోవటమే అజ్ఞానం గాని అజ్ఞానం అంటూ ప్రత్యేకంగా ఏమీలేదు. రమణమహర్షిని మేము చూడలేదు అని కొంతమంది చెపుతారు. ఒకవేళ కొంతమంది చూసారు అనుకోండి. ఏమి చూస్తారు? ఆయనలోని జ్ఞానమును మీరు చూడగలరా? మన శరీరం ఎలా ఉంటుందో ఆయన శరీరం కూడా అలాగే ఉంటుంది. అక్కడ చూడవలసింది జ్ఞానం. మనం ఎవరో మనకు తెలిస్తే, మన స్వరూపంలో ఉన్నది ఏమిటో మనకు తెలిస్తే అక్కడ ఉన్నదేదో మనకు తెలుస్తుంది. ఒక వ్యక్తిని అర్ధం చేసుకోవాలంటే ఆ వ్యక్తి యొక్క చైతన్యస్థాయి మనకు కూడా ఉండాలి, లేకపోతే మనకు అర్ధంకాదు. మీ మనస్సు అణిగి ఉంటే ఎక్కడ ఉన్నా సుఖమే. మనస్సు అణగకపోతే ఎక్కడ ఉన్నా మీకు దుఃఖమే మిగులుతుంది. సత్వగుణంలోనుండి సహనం వస్తుంది. సహనం ఏమి చేస్తుంది అంటే మరణంలేని వస్తువు నీ హృదయంలో ఎంత లోతులలో ఉందో అంతలోతులలోనికి తీసుకొని వెళుతుంది. అక్కడ నీవు ఆనందాన్ని అనుభవిస్తావు. నీ హృదయం యొక్క లోతులలోనికి వెళ్ళిపోతావు అనుకో, అక్కడ ఆనందంలో మునిగిపోతావు అనుకో ఆ అనుభవం గురించి మాకు ఎవరు చెపుతారు. ఆ ఆనందాన్ని మాకు చెప్పటానికి నీవు బయటకు రావాలి. దీనికి రామకృష్ణుడు ఏమి చెప్పాడు అంటే జ్ఞాని గోడమీద కూర్చొంటాడు ఒక ప్రక్క జ్ఞానాన్ని, ఆనందాన్ని చూస్తూ ఉంటాడు. రెండోప్రక్క లోకాన్ని చూస్తూ ఉంటాడు. ఆ ప్రక్కనున్న ఆనందం గురించి ఈ ప్రక్క ఉన్నవారికి చెపుతూ ఉంటాడు దాని కోసం వాడు గోడమీద కూర్చొంటాడు గాని పబ్లిసిటీ కోసం కాదు అని రామకృష్ణుడు చెప్పాడు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, ఏలూరు 3-1-2000

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

ఉపాసనవలన మనస్సు స్వాధీనంలో ఉంటుంది. పరమేశ్వరుని రూపాన్ని ధ్యానించటం, నామాన్ని స్మరించటం వలన ఇంద్రియాలు, మనస్సు స్వాధీనంలోనికి వస్తాయి. అంటే మనం ఎలా చెపితే అలా మనస్సు ఇంద్రియాలు శరీరం వింటాయి. మా మనస్సు బాగా లేదు. నిర్మలంగా లేదు అంటారు. మీరు మంచిపనులు చేస్తూ ఉంటే ఈశ్వరుని పట్ల భక్తి కలిగి ఉంటే మనస్సుకు శాంతి కలుగుతుంది. రాత్రి నిద్ర పోయే ముందు మీ మనస్సును నిర్మలంగా, నిశ్చలంగా ఉంచుకొంటే నిద్ర బాగా వస్తుంది. రాత్రి భాగంలో మీకు తెలియకుండా మీ మనస్సు సాధన చేస్తుంది. పెద్ద పెద్ద స్వామీజీలు కూడా పడుకొనే ముందు మంచి మంచి గ్రంథాలు కొద్దిసేపు చదువుకొని పడుకొంటారు. వారే అంత జాగ్రత్తగా ఉంటే మనం ఎంత జాగ్రత్తగా ఉండాలి. అజాగ్రత్త పనికి రాదు, అశ్రద్ధ పనికి రాదు. ప్రపంచంలో అనేక మతాలు ఉన్నాయి అనుకొంటాము. కాని ఉన్నవి రెండే మతాలు. 1. భగవంతుడు ఉన్నాడు అని చెప్పే మతం, 2. భగవంతుడు లేడు అని చెప్పే

మతం. మనలో మూడు గుణాలు తిరుగుతూ ఉంటాయి 1. తమోగుణం, 2. రజోగుణం, 3. సత్వగుణం. తమోగుణంలో ఉన్నప్పుడు బద్ధకంగా ఉంటాము. రజోగుణంలో ఉన్నప్పుడు చిరాకుగా, కోపంగా ఉంటాము, పరుషంగా గట్టిగా మాట్లాడతాము. సత్వగుణం ఉన్నప్పుడు నిర్మలంగా, తియ్యగా మాట్లాడతాము. మనం చెప్పేది ఇతరులకు అర్ధమయ్యేలాగ చెపుతాము. రజోగుణంలో నుండే కామక్రోధములు వస్తాయి. అవే మన ఆధ్యాత్మిక అభివృద్ధికి ప్రతిబంధకాలు.

ఈశ్వరుడిపట్ల సజీవమైన విశ్వాసం ఉంటే మనస్సు దాని అంతట అదే కండిషన్‌లో పడి ఉంటుంది. మీలో చాలామందికి దుఃఖం రావచ్చు. దుఃఖం నిజం కాదు. ఊహించుకోవటం వలన దుఃఖం వస్తుంది. అన్ని కాలాలలో, అన్ని అవస్థలలో భగవంతుడు ఉన్నాడు అని ఆయన పట్ల పరిపూర్ణమైన విశ్వాసం ఉంటే దుఃఖం రాదు. మనకు దుఃఖం వస్తూ ఉంటే భగవంతుని పట్ల విశ్వాసం లేదని, ఆయన పట్ల భక్తి లేదని గుర్తు. మానవుడికి ఆలోచన తక్కువ, ఉద్రేకం ఎక్కువగా ఉంటుంది. ఇది మానవ స్వభావం మనం ఉద్రేకం తగ్గించుకోవాలి, ఆలోచన పెంచుకోవాలి. మనం దానధర్మాలు చేస్తాము. కాని అశాంతిగా చేస్తాము దాని వలన మనం సుఖపడము, మనం ఎవరికైతే ఉపకారం చేస్తున్నామో వారు సుఖపడరు. దానం ఎలా చేయాలి అంటే నిర్మలమైన మనస్సుతో చేయాలి, ఎదుటి వారి క్షేమం కోరి చేయాలి. చేసేపని విడిచి పెట్టకూడదు, పని శ్రద్ధగా చేయాలి, శాంతిగా చేయాలి, పదిమందిక్షేమం కోరి చేయాలి. ఒక పని చేస్తే అది మనకు ఉపయోగపడాలి. సమాజానికి ఉపయోగపడాలి. ఆ పనివలన చిత్తశుద్ధి కలగాలి, భగవంతునిలో ఐక్యం అవ్వటానికి ఆ పని నీకు సహకరించాలి. నీవు ధర్మాన్ని ఆచరించు. ధర్మాన్ని ఆచరిస్తూ ఉంటే నీలోపల ఏమైనా దోషాలు ఉంటే అవి బయటకు వచ్చి కాలిబూడిద అవుతాయి అని వ్యాసుడు చెప్పాడు. నదికి అప్పుడప్పుడు వరదలు వస్తాయి. కాని నీవు భగవంతుని ప్రార్ధిస్తూ ఉంటే భగవదనుగ్రహం ప్రవాహంలాగ ఎప్పుడూ వస్తూ ఉంటుంది. ఆ ప్రవాహం నీ మనస్సులో ఉన్న దోషాలను కడిగేస్తూ ఉంటుంది. భగవంతుని దయ అటువంటిది.

మానవుడు ఎన్ని కష్టాలు అయినా పడతాడు, జనన మరణ చక్రంలో కొట్టుకొని పోతూ ఎన్ని ఇబ్బందులు అయినా పడతాడు కాని అహంకారాన్ని విడిచి పెట్టటానికి ఇష్టపడడు. ఇది మానవుడిలో ఉన్న పెద్ద దోషం. ఎందుచేతనంటే అహంకారమే నేను అనుకోవటం వలన దానిని విడిచిపెట్టడం లేదు. నేను అది చేసాను, నేను ఇది చేసాను అంటాడు. అది గాను, ఇది గాను ఉంటాడు గాని తానుగా ఉండడు. మన స్వరూపం అరూపం. మనకు రూపబుద్ధి, నామబుద్ధి నశిస్తే అది వ్యక్తమవుతుంది. ఏదో శనిగ్రహం అని, ఆ గ్రహం అని, ఈ గ్రహం అని జడుస్తావు. నీ మనస్సు అనే గ్రహం నుండి బయటకురా! ఏ గ్రహము నిన్ను ఏమీ చేయలేదు. ఇది భగవంతుడు చెప్పిన మాట అయితే ఈ మాటను

విని, అర్థం చేసుకొని, ఆచరించటానికి సత్వగుణం ఉండాలి. సత్వగుణం మనకు లేదు. మనందరము తమోగుణంలో ఉన్నాము కాని సత్వగుణంలో ఉన్నాము అనుకొంటున్నాము. 10 కోట్ల రూపాయలు అప్పులో ఉండి నేను నిల్వలో ఉన్నాను అనుకోవటం ఎటువంటిదో లోపల తమోగుణంలో ఉండి నోటితో సత్వగుణంలో ఉన్నాము అనుకోవటం అటువంటిదే. దాని వలన ప్రయోజనం ఏమిటి? సత్వగుణంలో ఉంటే నీ మొఖం ప్రశాంతంగా ఉంటుంది, నీ మాట నిర్మలంగా ఉంటుంది, ఏ పనిచేసినా లోకక్షేమం కోసం చేస్తాడు. సత్వగుణాన్ని ప్రాక్టీసు చేస్తే అంతర్‌దృష్టి కలుగుతుంది. స్థూల దృష్టి ఉన్నవాడికి దేహ సౌందర్యం, ఇంద్రియ సౌందర్యం తెలుస్తాయి. అంతర్‌దృష్టి ఉన్నవాడికి హృదయ సౌందర్యం, గుణ సౌందర్యం తెలుస్తుంది. ఒక మనిషిని చూస్తున్నాము అనుకోండి. వాడి కులం, గోత్రం చూడకూడదు. వాడిలో ఉన్న గుణం చూడాలి, అది ఎవడు చూస్తాడు అంటే అంతర్‌దృష్టి ఉన్నవాడు చూస్తాడు.

పనికి, జ్ఞానానికి విరోధం లేదు. పనిని విడిచి పెట్టినంత మాత్రంచేత నీకు జ్ఞానం కలుగదు. కర్మ విడిచిపెట్టినవాడు కర్మలేని స్థితిని పొందలేడు, వాడికి చివరకు సోమరితనం మిగులుతుంది. నీ పొట్ట కోసం ఏదో వృత్తి చేసుకో కాని అహంవృత్తిలో ఉండకు. కర్మ చెయ్యి కాని కర్తలేని కర్మ చెయ్యి. నేను చేస్తున్నాను అనే తలంపును వదిలి వెయ్యి. పని ద్వారా చాలా విషయాలు నేర్చకోవచ్చు. అలాగని నీవు అతిగా ఉండకూడదు. నీ ఉపాధి ద్వారా ఏది జరగవలసిఉందో ఆ పని నీవు చేస్తూ ఉండు, నీ ధర్మాన్ని నీవు ఆచరిస్తూ ఉండు. మిగతా విషయాలు భగవంతునికి విడిచిపెట్టు. నీవు చేసే పని శాంతంగా, సక్రమంగా చెయ్యి, ఫలితం కోసం చూడకు ఫలితం ఎప్పుడు ఇవ్వాలో భగవంతుడు ఇస్తాడు. ఒకోసారి ఫలితం ఇవ్వటం లేటు చేస్తాడు. మీ బుద్ధి కండిషన్‌లో లేకుండా ఫలాన్ని ఇచ్చి వేస్తే దానిని మీరు దుర్వినియోగం చేయవచ్చు, మీ క్షేమం కోసమే లేటు చేస్తున్నాడని మీకు అర్థమవ్వటంలేదు. కర్మఫలం ఎప్పుడు ఎక్కడ ఇవ్వాలో ఆయన చూసుకొంటాడు కర్మఫలం ఎవరి వాటా వారికి సక్రమంగా ఇచ్చేవాడే భగవంతుడు అందుచేత ఆయనను కర్మఫలధాత అని పిలుస్తారు. సూర్యుడు కనబడకుండా మేఘాలు ఎలా అడ్డువస్తున్నాయో అదేవిధంగా నీ లోపల సద్వస్తువు ఉన్నప్పటికి అది నీకు తెలియకుండా నీ తలంపులు అనే మేఘాలు అడ్డువస్తున్నాయి. వాటిని తీసి ఒక ప్రక్కన పెట్టు. లోపల ఉన్న సద్వస్తువు, లోపల ఉన్న ఈశ్వరుడు నీకు స్వరూపంగా వ్యక్తమవుతాడు. కర్మయోగానికి భక్తి ఉండాలి, జ్ఞానయోగానికి భక్తి ఉండాలి. సృష్టి అంతా నాది అనుకోవటం కర్మయోగం, సృష్టిలో ఏదీ నాది కాదు అనుకోవటం జ్ఞానయోగం. మహాత్మాగాంధీ గారు కర్మయోగి. ఈ ప్రపంచం నాది అనుకొని పనిచేసాడు. రమణమహర్షిగారు జ్ఞానయోగి. ఈ సృష్టిలో ఏదీ నాది కాదు అని ఆయన అనుకొన్నాడు. ఏ యోగం అయినా నిన్ను బ్రహ్మములో

ఐక్యం చేస్తుంది. మనం ఆ యోగానికి పనికిరాము, ఈ యోగానికి పనికిరాము. జీవుడు కర్మఫలాన్ని ఆశించి పనిచేస్తాడు. ఈశ్వరార్పణబుద్ధితో పనిచేయడు. కర్మఫలాన్ని ఆశించి చేస్తాడు. దాని ఫలాన్ని భోగిస్తాడు. అది అనుభవించేటప్పుడు వాసన పడుతుంది. వాసనలోనుండి తలంపు వస్తుంది. తలంపును బట్టి మరల పని చేస్తాడు. ఇది కర్మ సముద్రం. దేవుని అనుగ్రహం లేకుండా దీనిలోనుండి బయటకు రాలేవు. ఎప్పుడో భువనేశ్వర్‌లో టీ త్రాగాను. అది చాలా బాగుంది అని ఇప్పటికి జ్ఞాపకం వస్తోంది. ఎప్పుడో తాగిన టీ నా పొట్టలో ఉందా? లేదు, కాని అది చాలా బాగుంది అనే వాసన అలా ఉండిపోయింది. ఆ వాసన ఏమిచేస్తోంది అంటే అటువంటి టీ ఎక్కడ దొరుకుతుందా అని మనస్సు చూస్తుంది. అలా చూసినా ఫరవాలేదు. టీకోసమే చూస్తోంది కాని మోక్షం కోసం ప్రయత్నం చేయటంలేదు. ఇది కర్మరహస్యం.

బ్రహ్మానుభవం పొందే వరకు జీవలక్షణాలు ఆ ఉపాధిని విడిచిపెట్టవు. ఉపాధితో కలసిన నేను మాయనేను. ఉపాధిరహితమైన నేను నిజమైన నేను. గాఢనిద్రలో ఉపాధి లేనప్పుడు అక్కడ ఒక నేను ఉంది. అదే నిజమైన నేను. ఉన్నది ఏదో ఉంది, లేనిది ఏదో లేదు. ఉన్నదానికి లేకపోవటం అంటూ లేదు. లేని దానికి ఉండటం అంటూలేదు. ఇది నిశ్చయము. అని భగవంతుడు చెప్పాడు. ఇది తెలుసుకొంటే సుఖపడతావు. తెలుసుకోలేకపోతే శరీరం వెంట నీడ ఎలా వస్తోందో అలాగ ఏ జన్మకు ఆ జన్మ దుఃఖం నిన్ను వెంటాడుతుంది. నీవు లోకంతో రాజీపడటం కాదు. భగవంతునితో రాజీపడటం నేర్చుకో. భగవంతుని సంకల్పాన్ని నీ సంకల్పం చేసుకో.

భగవంతుని ప్రేమించగా, ప్రేమించగా, ఆరాధించగా, ఆరాధించగా మన అంతఃకరణంలో భగవంతుడు ప్రవేశిస్తాడు. ఆయన ప్రవేశించాక మన భౌతిక అభివృద్ధిని గాని, ఆధ్యాత్మిక అభివృద్ధిని గాని ఎవరూ ఆపుచేయలేరు. జ్ఞాని ప్రేమ ఒక కులానికి గాని, జాతికి గాని, ఒక ప్రాంతానికి గాని పరిమితమై ఉండదు. జాతి, మత, కుల విచక్షణ లేకుండా అందరికి ప్రేమను పంచిపెడతాడు. బాగా పండిన పండును రాయితో కొట్టనక్కరలేదు దాని అంతట అదే రాలిపోతుంది. అలాగే నీవు సహృదయంతో జీవిస్తూ ఉంటే, సద్బుద్ధికలిగి ఉంటే, సత్కర్మ చేస్తూ ఉంటే నీ మనస్సు పక్వానికి వచ్చి ప్రకృతిలోనుండి రాలిపోయి మోక్షంలో పడతావు. నీ జీవన విధానం ఎలా ఉండాలి అంటే నీ మనస్సుకు అంతర్ దృష్టి కలిగేలా జీవించాలి. అంతర్‌దృష్టి కలిగిన వాడికి ఆత్మజ్ఞానం కలుగుతుంది. ఆత్మజ్ఞానం కలిగినవాడికి ఉండటం అనేది స్వరూపంగా వ్యక్తమవుతుంది.

నీ దేహం ఏ పని మీద ఈ భూమి మీదకు వచ్చిందో ఆపని జరుగుతూ ఉంటుంది. కాని నీవు అంతర్‌దృష్టి అలవాటు చేసుకో. నీవు ధ్యానం చేసి, సత్పురుషుల సహవాసం చేసి, అర్చావతారాలను ఉపాసించి, నీకంటే చైతన్య స్థాయిలో ఎక్కువ ఉన్నవారికి గౌరవించి

వారి దగ్గర విద్య నేర్చుకొని నీ హృదయం యొక్క లోతులలో ఆత్మముత్యం ఎంత లోతులలో ఉందో అంతలోతులలోనికి వెళ్ళగలిగితే, అక్కడ మునగ గలిగితే అక్కడ నిలబడ గలిగితే ఆ వస్తువు నీకు అందుతుంది. ఆ వస్తువు తెలిసాక అయ్యో! ఇంతవరకు తెలియక దుఃఖపడిపోయాను, టైము అంతా వ్యర్థం చేసుకొన్నాను అని నీవు అనుకొంటావు. ఆవస్తువు తెలిసాక నీకు ఇంకా దుఃఖం మిగిలింది అనుకో అది అంతా ఆనందంగా మారిపోతుంది. అది జ్ఞానం యొక్క వైభవం. నీవు చేసేపని భగవంతుడు చూడడు. ఏతలంపుతో ఆపని చేస్తున్నావో భగవంతుడు చూస్తాడు. మన చేతికి ఏదైనా రోగం వచ్చింది అనుకోండి డాక్టరు దగ్గరకు వెళితే చెయ్యి తీసేస్తాడు, దొంగ బంగారం కోసం చెయ్యి నరుకుతాడు, ఇద్దరూ చెయ్యి తీసేసారు. డాక్టరుకు పాపం రాదు. దొంగకు పాపంవస్తుంది. ఎందుచేతనంటే తలంపులు తేడా. ముసలితనం చాలా మంచిది. ఇంట్లోవారు ఎవరూ పలకరించరు, ఇంట్లో పని ఉండదు, ఎలా ఉన్నా ఎవరూ పట్టించుకోరు అందువలన సాధనకు ఉపయోగించుకోవచ్చు. కాని ముసలివారు జరిగిపోయిన గొడవలు తలపెట్టుకొంటూ మనస్సును నరకం చేసుకొంటారు. కాలాన్ని పాడుచేసుకొంటారు. మీరు ధ్యానం చేయలేకపోతే సత్పురుషుల సహవాసం చెయ్యండి. సత్పురుషుల సహవాసం సహజమైన గాలి వంటిది. నీకు తెలియకుండా నీ దేహబుద్ధి రాలిపోతుంది. ఏదైనా పని ప్రారంభించారు అనుకోండి, అది మీరు చేయలేకపోతే సత్పురుషుల సహవాసం చేస్తూ ఉంటే మీరు మొదలుపెట్టినపని మధ్యలో ఆగకుండా వారు పూర్తి చేస్తారు. ఇతరులలోని లోపాలను చూడవద్దు. ఇతరుల లోపాలను అస్తమాను చూస్తూఉంటే మనలోపాలను చూసుకొనే టైము మనకు ఉండదు. ఇతరులలోపాలను చూసే బదులు మన లోపాలు ఏమిటో చూసుకొని వాటిని తొలగించుకొంటే మనం బాగుపడతాము. కృష్ణుడు మూడు విడిచి పెట్టమని చెప్పాడు, మూడు ప్రాక్టీసు చెయ్యమని చెప్పాడు. కోరిక , కోపం, అసూయ వీటిని విడిచిపెట్టమని చెప్పాడు. యజ్ఞ, దాన, తపస్సులను విడిచిపెట్టవద్దు అని చెప్పాడు. ఇది పరమేశ్వరుని ఆజ్ఞ.

**సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములు, మల్కిపురం, 21-1-2000**

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

గురువుకు అన్నీ తెలుస్తాయా అని ఒక భక్తుడు భగవాన్‌ను అడిగాడు. ఏది అయితే తెలుసుకోవలసిన విషయమో అది గురువుకు తెలుస్తుంది అని చెప్పారు. బంగారాన్ని అనేక రూపాలలో వస్తువులుగా చేయించుకోవచ్చు, అలాగే భగవంతుడు. గురువుగా అనేక రూపాలలో భూమి మీదకు వస్తాడు. ఏ గురురూపంలో వచ్చినా వాడు భగవంతుడే. మీరు ఏ గురురూపంలో ఆరాధించినా భక్తి ప్రధానం, శ్రద్ధప్రధానం గురువు మీద చాపల్యం లేని భక్తి ఉండాలి. షిరిడీ సాయిబాబా సిద్ధ పురుషుడు, మహాజ్ఞాని, మహాగురువు.

బాబాగారు సందర్భాన్ని బట్టి ఎవరైనా ఏదైనా అడిగితే చెప్పేవారు. ఒకసారి బాబాగారికి 2 రూపాయలు మనియార్డరు వస్తే ఒక భక్తుడు తీసుకొని వాడుకొన్నాడు. అది అతను బాబాగారికి చెప్పలేదు. బాబాగారు అతనిని అడగలేదు. బాబాగారు అడుగలేదు కాబట్టి ఆయనకు తెలియదు అని ఆ భక్తుడు అనుకొన్నాడు. కొంతకాలం తరువాత ఆ భక్తుడి ఇంట్లో 200 రూ.లు పోయింది. అప్పడ బాబాగారితో నాయింట్లో 200రూ. పోయింది అని బాదపడుతూ ఆ భక్తుడు చెప్పాడు. అప్పడు బాబాగారు ఏమి చెప్పారు అంటే నీ 200 రూ.లు పోయిందని నీవు ఎంత బాధపడుతున్నావో నా 2 రు.లు పోయిందని నేను అంతే బాధపడుతున్నాను అన్నారు. అప్పటివరకు 2 రూ. గురించి బాబాగారికి తెలుసును అనే విషయం ఆ భక్తుడికి తెలియదు. బాబాగారు చాలా ప్రాక్టికల్‌మేన్, ప్రత్యేకంగా ఏమీ చెప్పేవారు కాదు. మా కోరికలు నెరవేరటం లేదు అని ఎవరైనా బాబాగారిని అడిగితే 1.విష్ణు సహస్రనామాలు, 2.సుందరకాండ పారాయణం చేసుకోండి మీకు జరగవలసిన పనులు ఎప్పడు, ఎలా జరగాలో అలాజరుగుతాయి అని చెప్పేవారు.

నేను ధ్యానంలో కూర్చొన్నప్పడు ఆనందబాష్పాలు రాలుతున్నాయి. ఒకోసారి అవి రావటంలేదు అని అడుగుతున్నారు. దీనికి భగవాన్ ఏమి చెపుతున్నారు అంటే ఆనందం అనేది వచ్చేది కాదు, పోయేది కాదు, అది ఎప్పడూ వుండేది. సంతోషం ఎప్పడైనా వస్తుంది, పోతుంది. వచ్చేదీ, పోయేదీ వికారమే అది నీ మనస్సు యొక్క కల్పితం., అది జ్ఞానం కాదు. అది నిజం కాదు. నిజం అనేది నీ హృదయంలోనే ఉంది. దాని స్వరూపమే సుఖం, దాని స్వరూపమే శాంతి, అదే మోక్షం. నీవు అక్కడకు వెళ్ళాలి. నీ మనస్సును, ఇంద్రియములను ఉపసంహరించి అక్కడకు చేరినప్పడు నిప్పదగ్గర కూర్చొంటే ఎలా వేడిగా ఉంటుందో అలాగ నిజం దగ్గరకు నీవు చేరినప్పడు శాంతే నీకు స్వరూపంగా వ్యక్తమవుతుంది. విష్ణు సహస్రనామాలలో మాట దారుణః దానికి బాబాగారు ఏమి చెప్పారు అంటే భగవంతుడు దారుణంగా ఉంటాడు ఎవరి పట్ల దారుణంగా ఉంటాడంటే ఎవరైతే సత్పురుషులను, పవిత్రమైన హృదయంకలవారిని బాధపెడుతున్నారో అటువంటి వారిపట్ల భగవంతుడు దారుణంగా ఉంటాడు అని చెప్పారు. అక్రూరః అంటే భగవంతునికి క్రూరత్వంలేదు. భక్తులను బాధపెడుతూ ఉంటే అటువంటి వారిపట్ల మటుకు భగవంతుడు క్రూరంగా ఉంటాడు అని బాబాగారు చెప్పారు. ఎవరైతే అవమానాలు భరిస్తున్నారో వారికి బహుమానాలు వస్తాయి అని బాబాగారు చెప్పారు. మీ ఇంట్లో వ్యక్తులు గాని, బయట వారు గాని మిమ్మల్ని అవమానం చేస్తున్నారు అనుకోండి. అవమానాలు భరించే శక్తి మీకు ఉంటే భవిష్యత్‌లో భగవంతుడు మిమ్మల్ని బహుమానాలతో సత్కరిస్తాడు. 1.అహంభావన, 2.అభిమానం ఈ రెండూ ఉన్నంతకాలం ఆత్మజ్ఞానం కలుగదు. ఏ దేవున్ని పూజించినా, ఏగుడి చుట్టూ తిరిగినా ఈ రెండూ ఉన్నంత కాలం ఆత్మజ్ఞానం కలుగనే

కలుగదు. సాధన చేసి ఇవి రెండూ తొలగించుకోవాలి. ఎవరైతే సాధన చేసి వీటిని తొలగించుకొంటారో వారికి ఆత్మజ్ఞానం కలుగుతుంది అని బాబాగారు చెప్పారు. జీవితంలో ఏ సంఘటనలో ఫెయిల్ అయినా భవిష్యత్‌లో ఇంకో మంచి జరుగవలసి ఉంటుంది. అందువలన ఫెయిల్ అయినా ఫీల్ అవ్వద్దు అని బాబాగారు చెప్పేవారు.

ఒకోసారి శాంతి ఉంటుంది. ఒకోసారి అశాంతిగా ఉంటుంది. ఇది అంతా మనస్సు యొక్క కల్పితం. సుఖం వచ్చినా, దుఃఖం వచ్చినా నీవు ఉన్నావు. ఆ నేను ఎవడు? వాడే దొంగనేను. దొంగనేను ఎప్పడూ సమానంగా ఉండదు. గాలి వీస్తూ ఉంటే ఆకులు ఎలా కదులుతూ ఉంటాయో అలాగ దొంగ నేను పొగిడితే ఒకలాగ ఉంటుంది, విమర్శిస్తే ఒకలాగ ఉంటుంది. ఈ దొంగ నేనును ఒక ప్రక్కన కూర్చోబెడితే ఏమీ లేదు మీకు సాధన అక్కరలేదు మీరు బాబాలాగ సిద్ధపురుషులు అయిపోతారు. పుట్టిన వాడు చనిపోతాడు, చనిపోయిన వాడు పుడతాడు. నీకు పుట్టకలేదు, మరణంలేదు. ఇవి అన్నీ తలంపులే. దేహం ఎంత నిజమో నీకు వచ్చే తలంపులు కూడా అంతేనిజం. తలంపులు అన్నీ ఈ దొంగనేనులో నుండే వస్తున్నాయి. ఏ తలంపు వచ్చినా నీకు దుఃఖం తీసుకొని వస్తుంది. ఏదైతే మనం ఇంద్రియాలతో గ్రహించలేమో అది శాస్త్రం చెపుతుంది. నీ ఇంద్రియాలు, నీ మనస్సు ఎలా చెపితే అలా వినకు. శాస్త్రం ఎలా చెపితే అలా జీవించటం, అలా ప్రవర్తించటం నేర్చుకో. ఇతరుల ప్రవర్తనను విమర్శించే బదులు నీ ప్రవర్తనను చక్కదిద్దుకోసరిపోతుంది అనేవారు బాబాగారు. ఇతరుల ప్రవర్తన గురించి విమర్శిస్తూ ఉంటే నీ ప్రవర్తనను సరిచేసుకోవటానికి టైము ఉండదు. చావు ఎప్పడు వస్తుందో చెప్పలేము. అందుచేత నీ ప్రవర్తనను సరిచేసుకొని నీవు బాగుపడటానికి చూసుకో, ఇతరుల గొడవవద్దు. చెడ్డ గుణాలన్నీ కామక్రోదముల నుండి వస్తున్నాయి. ఇవి రజోగుణంలో నుండి వస్తున్నాయి. రజోగుణాన్ని, తమోగుణాన్ని విడిచిపెట్టాలి లేకపోతే జననమరణ చక్రంలో నుండి బయటకు రాలేవు. ఈ రెండు గుణాలునుండి బయటపడాలంటే సత్వగుణం అలవాటు చేసుకోవాలి. సత్వగుణం మనం బ్రతిమాలితే రాదు, అది అప్పడప్పడూ వస్తూ ఉంటుంది, వచ్చినప్పడు అది నిలకడగా ఉండేటట్లు చేసుకోవాలి. ఎవడైతే జ్ఞానాన్ని సముపార్జించాలని అనుకొంటున్నాడో వాడు సత్వగుణాన్ని నిలకడగా ఉంచుకోవాలి. సత్వగుణం ఉంటే ఏకాగ్రత, వివేకం, సహనం వస్తుంది, హృదయం యొక్క లోతులు పెరుగుతాయి.

గురువు ఎడ్రస్ మనకు తెలియకపోయినా, మన ఎడ్రస్ గురువుకు తెలుస్తూ ఉంటుంది. శరీరం చనిపోయిన తరువాత మనం ఎక్కడ ఉన్నా మనకు ఆయన మీద ప్రేమ కలుగజేసి, ఆకర్షణ కలుగజేసి ఆయనవైపు లాగుకొని మనకు తరించేశక్తిని కూడా ఆయనే ఇస్తాడు. వాడు సద్గురువు. ప్రేమించే శక్తిని కూడా ఆయనే మనకు ఇవ్వాలి.

20-02-2000

ఆయన ఇస్తే మనం పుచ్చుకోగలం కాని డిమాండ్ చేసి తెచ్చుకొనేది కాదు. హృదయం నిర్మలంగా ఉంటే, శుద్ధంగా ఉంటే, ఏకాగ్రంగా ఉంటే, నీకు అర్హత కలిగితే మోక్షం కోసం మీరు వెళ్లనక్కరలేదు మోక్షమే మీ దగ్గరకు వస్తుంది. నేను కూడా చాకిరీ చేస్తున్నాను, నాకు చాకిరీ తప్పటంలేదు అనేవారు బాబాగారు. ఇదేమిటి స్వామీ మీకు చాకిరీ ఏమిటి? అని అడిగితే ఎవరైతే నిర్మలంగా ఉంటారో, ఎవరి హృదయం అయితే పవిత్రంగా ఉంటుందో వారికి నేను దాసుడ్ని అవ్వవలసిందే అన్నారు బాబా. జేబులో ఎక్కువ డబ్బు ఉన్నవారిని డబ్బు ఇవ్వమని అడిగేవారు కాదు. ఒకోసారి 5 రూపాయిలు జేబులో ఉన్నవాడిని 3 రూపాయలు ఇవ్వమని అడిగేవారు. ఆయన ఎవరినైతే ఇవ్వమని అడుగుతున్నారో వాడు పరమలోభి అందువలన వాడికి ఇవ్వటం నేర్పటం కోసం అలా అడిగేవారు బాబాగారు. లోభిత్వం పోతే గాని మోక్షం రాదు అందువలన ఎవడికైతే లోభిత్వం ఉందో వాడినే అడిగేవారు. డబ్బుకు ఇబ్బంది పడేవారికి ఇచ్చేవారు. అంటే మీ సంసారం పాడుచేసుకోమని చెప్పటం కాదు. మీకు ఉన్నదానిలో ఇబ్బందిపడే వారితో ఎంతో కొంత పంచుకోమని చెప్పటం.

ఎంతో కొంత సాధన చేస్తున్నాను, బాగా చేస్తున్నాను అని చెప్పలేను. చేసేటప్పుడు ఒకోసారి సంతోషం వస్తోంది. ఒకోసారి భయం వస్తోంది. నా సాధన పరిస్థితి ఇలా ఉంది అని చెపితే ఆ సంతోషం ఎవరికి వస్తోంది? భయం ఎవరికి వస్తోంది? వికారం ఎవరికి వస్తోంది? ఇవి అన్ని దొంగనేనుకే వస్తున్నాయి. ఆ దొంగనేను ఎవడు? అని ప్రశ్న ఎందుకు వేసుకోవు. ఈ దొంగనేను దేహాన్ని, దేహానికి పెట్టిన పేరును ఆశ్రయించి ఉంటోంది. ఈ రెండూ తీసేస్తే దొంగ నేను దాని అంతట అదే పోతుంది. ఆశ్రయం తప్పించాలి, అది తప్పించకుండా నేను భగవద్గీత రోజూ పారాయణం చేస్తున్నాను అంటే కుదరదు. భగవంతుడు నీ హృదయంలో ఉన్నాడు. నీకు తెలిసినా ఉన్నాడు, తెలియకపోయినా ఉన్నాడు. నీ హృదయంలో ఉండి ఈ దేహాన్ని ఎప్పుడు, ఎక్కడ, ఎలా ఉంచాలో నీ చివరిశ్వాస ఎప్పుడు జరగాలో నీ దేహాన్ని కంట్రోలు చేస్తున్నాడు. నీకు బయట చూపే గాని లోపలిచూపు లేదు. అందుచేత నీకు ఆయన కనబడటంలేదు. అసలు వస్తువును తెలుసుకొంటే బ్రహ్మం నీకు తెలిస్తే ఈ దేహంయొక్క ప్రారబ్ధం నిన్ను ఏమీ చేయలేదు, అది మిమ్మల్ని ముట్టుకోదు. మీకు ఆత్మజ్ఞానం కలిగితే దేహం గొడవ మీకు ఉండదు. ఈ దేహం భూమిమీదకు ఎందుకు వచ్చిందో ఆ పని చేసుకొని పోతుంది, ఆ గోల మనకేల అని నీకు అనిపిస్తుంది. అది జ్ఞానం యొక్క వైభవం.

జ్ఞానగమ్యః; జ్ఞానం వలన పొందబడే వాడే భగవంతుడు. అందువలన జ్ఞానం సంపాదించటానికి ఏదో మార్గంలో ప్రయాణం చెయ్యి. ఆత్మజ్ఞానాన్ని సంసాదించు. ఆత్మజ్ఞాన సముపార్జన ఉన్నవారికి మాత్రమే ఈశ్వరుడు పొందబడతాడు. ఆత్మానుభవం

కలిగేవరకు నీవు సాధన చేయవలసిందే, మధ్యలో ఆగకు. చిన్నపిల్లలు దారిలో ఏదైనా కనబడితే అక్కడ ఆగిపోతారు. మనం ఏ పనిమీద వారిని పంపామో అది మర్చిపోతారు. అలాగే మనం కూడా భగవంతుడు ఏ పని మీద భూమి మీదకు పంపాడో ఆ పని మర్చిపోతున్నాము. లోకంలో ఉన్న ఆకర్షణలకు లోబడిపోతున్నాము, గమ్యానికి చేరటంలేదు. నీవు సాధనచేసేటప్పుడు మధ్యలో నీకు అనేక అనుభవాలు కలుగవచ్చు, సన్మానాలు చేస్తారు. మహిమలు చేసే శక్తి రావచ్చు. అక్కడితో ఆగవద్దు. వాటి మాయలో పడవద్దు. నీవు మద్రాసు వెళుతున్నావు అనుకో. ప్రయాణంలో గుడివాడ దగ్గర పెసరట్లు అమ్ముతున్నారని దిగిపోతే రైలు వెళ్ళిపోతుంది. అలాగే ఈ లోకంలోని ఏదో ఆకర్షణలో మనస్సు పడిపోతే మనస్సు అందులో ఉండిపోతుంది, శరీరం చనిపోతుంది. గమ్యాన్ని మిస్ అవుతావు. ఈ లోకంలోగాని, పరలోకంలోగాని ఏదైనా సాధించాలంటే ఏకాగ్రత ఉండాలి. నీకు ఏకాగ్రత లేకపోతే బాధపడకు, ప్రయత్నం చేసి సాధించు అని బాబాగారు చెప్పారు. నీవు సోమరితనంగా ఉండవద్దు. ఏదో మంచిపని చేస్తూ ఉండు. దాని వలన నీకు శాంతి కలుగుతుంది, జ్ఞాన సముపార్జన చేయాలనే బుద్ధికలుగుతుంది. పూజ చేయడు, జపం చేయడు, ధ్యానం చేయడు, మంచిపని చేయడు వాడికి శాంతి కావాలంటాడు. మీకు శాంతికావాలన్నా, ఆనందం కావాలన్నా పరమేశ్వరుని ఆరాధించటంలో పొరపాటు చేయకండి. మీకు సంతోషం వచ్చినా, ఆనందం వచ్చినా అక్కడే ఆగిపోవద్దు. ఈ సంతోషం ఆనందం ఎవరికి వస్తోంది అని విచారణ చెయ్యండి. అవి కూడా దొంగ నేనుకే వస్తున్నాయి. సర్వఅనర్థాలకు వాడే కారణం. వాడు నశించే వరకు గమ్యానికి వెళ్ళలేరు. అది నశించే వరకు సాధన విడిచి పెట్టవద్దు. మీరు సాధన చేసేటప్పుడు మీ ఇంట్లోని వారు మీకు దూరం అవుతున్నారు అని మీకు అనిపిస్తుంది. కాని దూరం అవ్వరు. హృదయంలో సన్నిహితం అవుతారు. అది మీకు అర్థంకాక వారు మనకు దూరమవుతున్నారని అనిపిస్తుంది. వారు ఏదో అన్నారని, వీరు ఏదో అన్నారని నీవు బాధపడవద్దు. వారి మీద వైరం పెట్టుకోవద్దు. దాని గురించి నీవు బాధపడ్డా వారి మీద వైరం పెట్టకొన్నా నీ మనస్సు వెళ్ళి వారి మీద వాలుతుంది. వారిగొడవ వదిలెయ్యి. నీ పని నువ్వు చూసుకో అని బాబాగారు చెప్పారు. వారు ఏదో అన్నారని అందులో చిక్కుకొంటావు అనుకో నీ యాత్ర ఆగిపోతుంది. నిజంగా నీశ్రేయస్సు కోరే వారు ఇలా చేసుకోండి. అలా చేసుకోండి అని జాగ్రత్తగా మీకు అర్థమయ్యేలా సలహా చెపుతారు. మిమ్మల్ని విమర్శించే వారు అసూయతో విమర్శిస్తారు. అందువలన విమర్శలను పట్టించుకోవద్దు. మనకు అన్ని విధాల బాగుంటే అందరూ స్నేహితులే. మనకు కష్టం వస్తే ఎవరూ కనిపించరు. నీకు కష్టం వచ్చినప్పుడే నీకు స్నేహితుడు ఎవడో విరోధి ఎవడో తెలుస్తుంది.

నాకు చావు అంటే భయం వస్తోంది అని ఒకరు అడుగుతున్నారు. చావు భయం

పోవటం కష్టం. అందుచేత మనం చనిపోతాము అంటే ఎంత డబ్బు ఖర్చుపెట్టి అయినా డాక్టర్ల దగ్గరకు వెళతాము, ఈ దేహం నిలబెట్టటానికి చాలా ప్రయత్నాలు చేస్తాము. కాని చావు కూడా ఒక తలంపే. చావు అంటే భయం అంటున్నావు. నీకు నిద్రలో ఉండగా చావు అంటే భయం వస్తోందా అని భగవాన్ అడుగుతున్నారు. నిద్రలో నీకు చావు భయంలేదు. చావు ఎవరికి వస్తోంది? దేహానికి వస్తోంది. దేహం ఎవరు అనుకొంటున్నావు? నేను అనుకొంటున్నావు. అందుచేత దేహం చనిపోయినప్పుడు నేను చనిపోతున్నాను అనుకొంటున్నావు. దేహంలేని స్థితిలో నీవు ఉన్నప్పడు దేహానికి చావు వచ్చినా నేను చనిపోతున్నాను అని నీవు అనుకోవు. గాఢనిద్రలో నీకు దేహం లేదు. అక్కడ దేహం లేదు కాబట్టి అక్కడ నీకు చావు భయం కూడా ఉండదు. చావు తలంపు; పుట్టుక తలంపు, నీ దేవుడు తలంపు, నీ దేహం తలంపు ఈ తలంపులతో సంబంధం లేకుండా ఉన్నది నీ హృదయంలో ఉన్న ఈశ్వరుడు. గుడిలో ఉన్న ఈశ్వరుడు కాదు నీ హృదయంలో ఉన్న ఈశ్వరుడు. తలంపు వచ్చాక నీకు చావు భయం వస్తోంది. తలంపు ఎంత నిజమో అది కూడా అంతే నిజం. జాగ్రదవస్థలో నీవు దేహంగానో, లోకంగానో ఉంటున్నావు. గాఢనిద్రలో నీవు లోకంగా లేవు, దేహంగాలేవు, దేవుడిగా లేవు నీవు నీవుగా ఉన్నావు. అక్కడ నీకు ఏమీ కనిపించటంలేదు , వినిపించటంలేదు, నీ దేహం అక్కడ తెలియటంలేదు. అంతమాత్రంచేత నీవు అక్కడలేవా? నీవు ఉన్నావని నీకు తెలుస్తోంది కదా. దానిని పట్టుకోవటమే జ్ఞానం. వెళ్ళొస్తాము, వెళ్ళొస్తాము అని చెప్పి వెంటనే మరల తిరిగి వచ్చేస్తే ఏమిటి? ఎక్కడకు వెళితే మరల తిరిగిరామో ఆ స్థితికి వెళ్ళు. ఆస్థితినే నీవు సంపాదించాలి. చనిపోయే దేహంతో ఎలా తాదాప్యం పొందుతున్నావో అలాగ నీ హృదయంలో ఉన్న చావులేని వస్తువుతో తాదాప్యం పొందితే అదే జ్ఞానం. ఎవరి మార్గంలో వారిని ప్రయాణం చేయనివ్వండి, వారు తరించటం ముఖ్యం. బలవంతంగా మార్గం మార్చకండి అని భగవాన్ చెప్పేవారు.. నీవు ఎవరో నీకు తెలిస్తే అది జ్ఞానం, నీవు ఎవరో నీకు తెలియకపోతే అది అజ్ఞానం. ఆత్మానుభం నీకు ఉండి ఆ అనుభవాన్ని రీజనింగ్, లాజిక్‌తో ఇతరులకు చెప్పగలిగితే అది విజ్ఞానం

Chief Editor,Printer and Publisher **P.S. Rama Raju**

Owner Lakshmi Modern Rice Mill, Palakol

☎ 08814 - 24589, 24689

Printed at **Shriram Graphics,** Bank Street, Palakol

# ఆధ్యాత్మిక అభివృద్ధికి అమృత భాషణాలు

ఈనాటికైనా, ఏనాటికైనా మనం కానిదానిలో
నుండి విడుదల పొందితేనే గాని మనం
ఎవరిగా ఉన్నామో మనకు తెలియబడదు.

వ్యక్తిగత భావన పెంచుకొన్నవాడు
అధోఃగతి చెందుతాడు,
అది తగ్గించుకొన్నవాడు పురోగతి చెందుతాడు.

రూపచింతన, నామ చింతన వలన
అహంవృత్తి పెరుగుతుంది.
అహంవృత్తి నశిస్తేనేగాని అహంస్ఫురణ తెలియదు.

ఆత్మ జ్ఞానం మనస్సుతో సంపాదించేది కాదు.
మనస్సు ఎక్కడ అణిగితే
అక్కడ జ్ఞానోదయం అవుతుంది.

లౌకిక విద్యలు తిండికి, బట్టకు ఉపయోగపడతాయి.
ఆత్మ విద్య మోక్షమును ప్రసాదిస్తుంది.

ఎలా పనిచేస్తే మనకు ఆత్మజ్ఞానము లభ్యమవుతుందో
అలా పని చేయటం నేర్చుకోవటమే యోగం.

- **శ్రీ నాన్నగారు**